క్లుప్తంగా

వైభవంగా పల్లకీసేవ



ప్రత్యేక అలంకరణలో స్వామి

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం స్వామి అమ్మవార్ల పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన వెంకటశేషయ్య



సజ్జల రామకృష్ణారెడ్డిని సత్కరిస్తున్న మందల వెంకటశేషయ్య

వెంకటాచలం: వైఎస్సార్‌సీపీ పీఏసీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వెంకటాచలం మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, ఇతర నాయకులు శనివారం కలిశారు. నెల్లూరుకు వచ్చిన సజ్జలను వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో కలిసి శాలువాతో సన్మానించారు.

రిటైర్డ్ లస్కర్‌కు సన్మానం



కొడవలూరు: కొడవలూరు ఇరిగేషన్ సెక్షన్‌లో లస్కర్‌గా పనిచేసి శనివారం పదవీ విరమణ పొందిన కోవూరు శ్రీనివాసులును స్థానిక ఇరిగేషన్ కార్యాలయంలో శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖలో లస్కర్‌గా 42 ఏళ్ల పాటు రైతులకు స్నేహపూర్వక సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, లస్కర్‌లు వాసు, విజయ్ కుమార్, యాసిన్, శ్రీనివాస రావు, షబ్బీర్, బాబాసాహెల్, అన్వర్‌బాషా పాల్గొన్నారు.

బటర్‌ఫ్లై గార్డెన్‌ను సందర్శించిన అగ్రి విద్యార్థులు



బటర్‌ఫ్లై గార్డెన్‌లో విద్యార్థులు

తోటపల్లిగూడూరు: మండలంలోని ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ అభివృద్ధి చేసిన బటర్‌ఫ్లై గార్డెన్ (సీతాకోక చిలుక తోట) విజ్ఞాన పర్యాటకులకు కేంద్రంగా మారింది. ప్రకాశం జిల్లా కనిగిరిలోని కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు 50 మంది గార్డెన్‌ను సందర్శించారు. విద్యార్థులు ప్రాథమిక సమాచారం తెలుసుకున్నారు. ఇక్కడ అందమైన రకరకాల సీతాకోక చిలుకలు ఉన్నాయని, ప్రత్యేకమైన సౌకర్యాలను ఇక్కడ కల్పించడం జరిగిందని సీఈఓ రాఘవ్ త్రివేది వెల్లడించారు.

ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ

ముత్తుకూరు (పొదలకూరు): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముత్తుకూరు మండలం పిడతాపోలూరు, మునునూరువారిపాళెం గ్రామాల్లో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం పాల్గొని పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి నియోజకవర్గంలో మొత్తం 38,497 పింఛన్లను ప్రతి నెల అందజేస్తున్నామని, ఇందుకోసం రూ.16.64 కోట్లు వెచ్చించిస్తున్నట్టు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

3న జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జూన్ 3వ తేదీన జిల్లా ఫుట్‌బాల్ సబ్ జూనియర్స్, జూనియర్ బాలబాలికల జట్ల ఎంపికలు జరుగనున్నాయని జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి బి.చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 9 గంటలకు ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాల కోసం బి.ఉమాశంకర్ 99498 53555, చంద్రశేఖర్ 94407 42002 నంబర్లను సంప్రదించాలన్నారు.

విత్తనాలు, ఎరువులకు రైతుల అవస్థలు



తెరుచుకోని మనుబోలు రైతు సేవా కేంద్రం

- గతంలో ఆర్బీకేల ద్వారా ముంగిటకు సేవలు
- గత ప్రభుత్వంలో ధాన్యానికి గిట్టుబాటు ధరలు
- కూటమి పాలనలో ధరలు పతనం
- ఎడగారు సాగుపై సన్నగిల్లుతున్న ఆశలు
- తెరుచుకోని రైతు సేవా కేంద్రాలు

సర్వేపల్లిలో రైతు భరోసా కేంద్రాలు	89
పనిచేసే ఉద్యోగులు	89
ఆర్బీకేల ద్వారా 2022-23లో రైతులకు అందిన ఎరువులు	7,427 మెట్రిక్ టన్నులు
ఆర్బీకేల ద్వారా 2022-23లో అందించిన విత్తనాలు	1,625 క్వింటాళ్లు
రైతు భరోసా అర్హుల సంఖ్య	30,242 మంది
గతంలో వీరికి అందించిన పెట్టుబడి సాయం	రూ.105.87 కోట్లు
సున్నా వడ్డీ పంట రుణాలు	9,269 మందికి
గతంలో వీరికి అందించిన సాయం	రూ.33.26 కోట్లు

పొదలకూరు: గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు రైతు నేస్తాలుగా పనిచేశాయి. విత్తనం నుంచి విక్రయం వరకు రైతులకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈ–క్రాప్ బుకింగ్ ద్వారా రైతులు ఆర్బీకేల నుంచి పండించిన పంటలను గిట్టుబాటు ధరలకు అమ్ముకునే అవకాశం కల్పించారు. ఎరువులు, పురుగు మందులతో పాటు, వైఎస్సార్ యంత్రసేవా పథకానికి రైతులను ఎంపిక చేసి రైతులకు సంబంధించిన ప్రతి అంశాన్ని ఆర్బీకేల పర్యవేక్షణలోనే వ్యవసాయాధికారులు నిర్వహించారు. ఇపుడా పరిస్థితులు లేకుండా పోయాయని రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. ఎడగారులో సర్వేపల్లి నియోజకవర్గంలో సుమారు 30 నుంచి 35 వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. పొదలకూరు మండలంలో పెన్నార్ డెల్టా ప్రాంతంలో నాట్లు కూడా పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్నా అన్నదాత సుఖీభవ పథకం అందజేయలేదు. దీంతో పెట్టుబడి సాయం కోసం చిన్న, సన్నకారు రైతులకు ఎదురు చూపులే మిగిలాయి. గతంలో ధాన్యం పుట్టి ఒక్కటింటికి రూ.22 వేల నుంచి రూ.24 వేలు ధరలు పలికాయి. గడిచిన రబీలో పండించిన వరిధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు నానా రకాలుగా ఇబ్బందులు పడ్డారు. పుట్టి రూ.17 వేల నుంచి రూ.19 వేలు మాత్రమే ధరలు పలికాయి.

ముందుగా నగదు చెల్లిస్తేనే ఎరువులు

వ్యవసాయశాఖ ద్వారా ఇపుడు రైతు సేవా కేంద్రాలు నడుస్తున్నాయి. ఎరువులు, విత్తనాలు అవసరమైన వారు ముందుగా రైతు సేవా కేంద్రాల ద్వారా నగదు చెల్లిస్తేనే ఎరువులు దిగుమతి అవుతాయి. గత ప్రభుత్వంలో ప్రతి ఆర్బీకేకు ముందుగా ఎరువుల లోడ్లు దిగుమతి చేసుకుని అవసరమైన రైతులకు అందజేసేవారు. ఇపుడు ఆ పరిస్థితులు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు ఎరువులు తీసుకుని వెళ్లి సక్రమంగా చెల్లించకపోవడం వల్లనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు అధికారులు వెల్లడిస్తున్నారు. దీంతో సకాలంలో ఎరువులు రైతులకు అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట (భూమికి దమ్ముకోసం) విత్తనాలను 50 శాతం సబ్సిడీతో అందజేస్తున్నారు. ఎడగారులో వరి విత్తనాలు రాయితీతో అందిస్తే ఉపయోగంగా ఉంటుందని రైతులు అంటున్నారు.



గత ప్రభుత్వంలో పొదలకూరులో ఏర్పాటు చేసిన అగ్రిల్యాబ్(ఫైల్)

వ్యవసాయ ఇబ్బందులు



రైతులు ప్రస్తుతం వ్యవసాయ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్టుబడులు బాగా పెరిగినా అందుకు తగిన విధంగా ధాన్యానికి ధరలు లభించడం లేదు. రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందడం లేదు.

– శ్రీహరిరెడ్డి, రైతు, అక్కంపేట

సేవలు పెంచాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా గతంలో మాదిరి సేవలు పెంపొందించాలి. విత్తనం నుంచి విక్రయం వరకు రైతు సేవా కేంద్రాల ద్వారానే జరగాలి. రైతుల అవసరాల మేరకు ఎరువులు, విత్తనాలు అందజేయాలి. అన్నదాత సుఖీభవ సకాలంలో అందజేస్తే చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.

– జీ.రామయ్య, రైతు, చెర్లోపల్లి

ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించాలి



ఎడగారులో పండించే వరి ధాన్యానికైనా ప్రభుత్వం ముందస్తుగా ప్రణాళికలు రూపొందించి గిట్టుబాటు ధరలు కల్పించాలి. రబీలో చాలామంది రైతులు ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఇబ్బందులు పడ్డారు. పెట్టుబడులు పెరుగుతున్నా తదనుగుణంగా ధాన్యం ధరలు పెరగడం లేదు.

– కె.రమణారెడ్డి, రైతు, మహ్మదాపురం

అన్నదాతకు గడ్డుకాలం

కోవూరు : కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు గడ్డుకాలం మొదలైంది. అమలు చేస్తామన్న హామీలను గాలికి వదిలేయడంతో వారు కష్టాల ఊబిలో చిక్కుకుపోయారు. దీనికి తోడు రైతులకు తోడుగా ఉన్న ఆర్బీకేలను నిర్వీర్యం చేయడం, గిట్టుబాటు ధర కల్పించలేకపోవడంతో అన్నదాతలు దిగాలు చెందుతున్నారు.

నాడు స్వర్ణయుగం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో రైతులను చేయి పట్టుకుని నడిపించేలా ఆర్బీకేలు పనిచేసేవి. అక్కడే పంటల కొనుగోలు జరిగేవి. ఈ–క్రాప్ కింద నమోదు చేసుకున్న ప్రతి రైతుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చర్యలు తీసుకున్నారు. ఒకవేళ ఎక్కడైనా తప్పు జరిగితే టోల్ ఫ్రీ నంబర్ 1907కు ఫోన్ చేస్తే వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకుని పంటలను కొనుగోలు చేసేది.

నేడు దీనస్థితి

ప్రస్తుతం ధాన్యం కొనుగోలులో ఏ రైతుకు కనీస గిట్టుబాటు ధర రావడం లేదు. ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలుగా మార్చిన కూటమి ప్రభుత్వం వాటి ద్వారా అన్నదాతలకు మేలు చేసిన పాపాన పోలేదు.

కోవూరు సబ్‌డివిజన్ పరిధిలో..

రైతుల సంఖ్య	28,897
సాగు చేస్తున్న ఎకరాలు	43,759
కౌలు రైతులు	4080
రైతు సేవా కేంద్రాలు	76
ధాన్యం కొనుగోలు కేంద్రాలు	35

రైతులను ఆదుకోవాలి



ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించి రైతులను ఆదుకోవాలి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న పెట్టుబడి సాయం అందించి రైతులకు అండగా నిలిచారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో చిన్న, సన్నకారు రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

– నక్కా యేహాను, రైతు, విడవలూరు

పెట్టుబడి సాయం అందించాలి



పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్న రైతులకు నిరాశే మిగిలింది. చంద్రబాబు మాటలు నమ్మి ఓట్లేసిన గెలిపించాం. ఆ మేరకు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం పెట్టుబడి సాయం అందించాలి.

– దక్కా హరీంద్ర, రైతు, విడవలూరు



వైఎస్సార్ యంత్రసేవ ద్వారా లబ్ధిపొందిన రైతులు (ఫైల్)

ధూమపానంతో ఆరోగ్యం చిత్తు

కొడవలూరు: ధూమపానంతో ఆరోగ్యం పూర్తిగా పాడవుతుందని లైబ్రేరియన్ కె.రాజేశ్వరి తెలిపారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ధూమపానంతో కలిగే నష్టాలపై స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధూమపానం వల్ల కేన్సర్ రావడంతో పాటు ఊపిరితిత్తులు పాడవుతాయని తెలిపారు. ధూమపానం వద్దు.. ఆరోగ్యమే ముద్దు అనే ప్లకార్డులను విద్యార్థులు ప్రదర్శించారు.



కొడవలూరు గ్రంథాలయంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పొగాకును విడనాడాలి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పొగాకును వాడేవారు ఆ అలవాటును విడనాడాలని ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆయన పట్టణంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొగాకు నమలడం వల్ల నోటి కేన్సర్, ఊపిరితిత్తుల తదితర దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఇళ్లలో పెద్దలకు పొగాకు వల్ల కలిగే అనర్థాలను వివరించాలని సూచించారు.

మా స్థలాన్ని ఇప్పించండి

విడవలూరు: తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న తమ స్థలం ఆక్రమణలకు గురవుతోందని, మా స్థలాన్ని ఇప్పించాలని ఊటుకూరు శంకర్‌నగర్ కాలనీకి చెందిన గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పొట్లూరు వెంకటేశ్వర్లు, పురాకత్తి మౌనిక, తాండ్రా శేషమ్మ శనివారం విలేకరులతో మాట్లాడారు. ఊటుకూరు శివారుల్లోని సర్వే నంబర్ 1243లో అప్పట్లో చింతపండు ఏరు ఉండేదని, అక్కడ తాము చేపలు పట్టుకొని జీవనం సాగించామని, తరువాత ఏరు పూడిపోవడంతో ఇక్కడ మూడు ఎకరాల్లో 1.50 సెంట్లకు కట్టలు పోసుకుని రొయ్యల గుంతను ఏర్పాటు చేసుకున్నామన్నారు. మిగిలిన 1.50 సెంట్లను బాగు చేసుకునేందుకు తమ వద్ద డబ్బులు లేక ఖాళీగా ఉంచామన్నారు. ఈ క్రమంలో పక్కనే సాగు చేసుకుంటున్న ఓ వ్యక్తి రాత్రి వేళల్లో జేసీబీ పెట్టి తమ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే నా వద్ద స్థలానికి చెందిన అన్ని పత్రాలు ఉన్నాయని బెదిరిస్తున్నట్టు వాపోయారు. కార్యక్రమంలో గ్రామస్తులు తాండ్ర రవణమ్మ, విమలమ్మ, శైలజ, శీనయ్య, నాగరాజు, చెంచయ్య, వెంకటరమణమ్మ, చిన్న రమణయ్య పాల్గొన్నారు. కాగా దీనిపై తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఊటుకూరు గ్రామంలోని చెంతపండు ఏరు ప్రభుత్వానికి చెందిన స్థలమని, ఎవరు ఆక్రమణలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు.



మాట్లాడుతున్న శంకర్‌నగర్ గ్రామస్తులు

రైతులు జాగ్రత్తలు పాటించాలి

విడవలూరు: వరినారు పీకే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా రైతు పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వినీత కోరారు. మండలంలోని దంపూరు, వరిణి గ్రామాల్లో రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని, మాట్లాడారు. రైతులు కేఎన్ఎం–733 రకం నారును పీకే సమయంలో నీరు పడుతూ తీయడం ద్వారా నారు తెగిపోకుండా వస్తుందన్నారు. అదేవిధంగా మట్టి నమూనా సేకరణ విషయంలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, శాస్త్రవేత్తల సూచనల పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం నుంచి మధురిమ, ఫిషరీ శాస్త్రవేత్త హరి, వ్యవసాయాధికారి పి.వెంకటకృష్ణయ్య, వీఏఏలు సాయి మహేష్, వెన్నెల పాల్గొన్నారు.



రైతులకు వివరిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

నేడు సర్వేపల్లి నాయకులతో కాకాణి పూజిత సమావేశం

వెంకటాచలం: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కుమార్తె పూజిత నెల్లూరు నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సర్వేపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహిస్తారని పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మందల వెంకటశేషయ్య తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభంకానున్న ఈ సమావేశానికి నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జూన్ 4 తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమం విజయవంతం చేయడానికి నాయకులతో చర్చించడం జరుగుతుందని తెలిపారు.

శైలజకు డాక్టరేట్



శైలజ

వెంకటాచలం: విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) కావలి క్యాంపస్ వాణిజ్య విభాగానికి చెందిన పరిశోధకురాలు ఎంవీఎల్ శైలజకు వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. శైలజ నెల్లూరు జిల్లాలోని గ్రామీణ చేతివృత్తులు (చేనేత కార్మికులు) ఆర్థిక అంశాలు, ప్రభావం అనే అంశంపై పరిశోధనను విజయవంతంగా పూర్తి చేయడంతో వీఎస్‌యూ డాక్టరేట్ ప్రదానం చేసింది. డాక్టరేట్ పొందిన శైలజ వీఎస్‌యూ కావలి క్యాంపస్ వాణిజ్య విభాగాధిపతి వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

హెచ్ఐవీ బాధితులకు సరిపడా మందులివ్వాలి

నెల్లూరు(అర్బన్): హెచ్ఐవీ బాధితులకు సరిపడా మందులను క్రమం తప్పకుండా అందించాలని జిల్లా ఎయిడ్స్, టీబీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ సంబంధిత డాక్టర్లకు సూచించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో హెచ్ఐవీ నియంత్రణ సమన్వయ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులను ప్రేమగా పలకరించి తగిన కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. వారికి అందించే సేవల్లో ఏమాత్రం అలసత్వం చూపకూడదని తెలిపారు. హెచ్ఐవీ రోగులకు ఎప్పటికప్పుడు స్వచ్ఛంద సంస్థల సభ్యులు కౌన్సెలింగ్ ఇస్తూ వారిని ధైర్యంగా జీవితంలో ముందుకు సాగేలా చూడాలన్నారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు సమన్వయంతో పనిచేస్తూ హెచ్ఐవీ రహిత నెల్లూరు కోసం కృషి చేద్దామని సూచించారు.

ప్రసన్నను కలిసిన ఎండీయూ ఆపరేటర్లు

కోవూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసిన ఎండీయూ ఆపరేటర్లు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2027 వరకు తమకు కాంట్రాక్టు ఉన్నప్పటికీ 2025 జూన్ నుంచే తొలగించారని, వాహనాలకు చెల్లించాల్సిన ఈఎంఐలు సైతం ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, తమ జీవనం భారమైపోయిందంటూ ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ప్రసన్న ఈ విషయమై అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని భరోసా ఇచ్చారు.



ప్రసన్నకు వినతి పత్రం ఇస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

మైనారిటీ నేతల పరామర్శ

కోవూరు: ఇటీవల చేతికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో పార్టీ మైనారిటీ నేతలు శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖలీల్ అహమ్మద్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సిద్దీఖ్, నెల్లూరు 42వ డివిజన్ ఇన్‌చార్జి అబ్దుల్ మస్తాన్, రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి సమీర్ ఖాన్, జిల్లా ఆర్గనైజేషనల్ సెక్రటరీ అల్లాభక్షు, పార్టీ బుచ్చి పట్టణాధ్యక్షుడు షాహుల్, రూరల్ అధ్యక్షుడు సీహెచ్ సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



ప్రసన్నతో మాట్లాడుతున్న మైనారిటీ నాయకులు

వెంకయ్యస్వామికి విశేష పూజలు

మనుబోలు: మండల పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో వున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసులు మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపించి ప్రత్యేక పుష్పాలంకరణ చేసి విశేష పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వివాహం, సంతానం కోసం పలువురు హోమ గుండం వేసి ధుని పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమానికి సోమల వెంకటకృష్ణరెడ్డి, రజేశ్వరి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



వెంకయ్యస్వామి పూజలో ఉభయకర్తలు

రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ

మనుబోలు: జూన్ 1 నుంచి రేషన్ డీలర్ల ద్వారా లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ బషీర్ తెలిపారు. శనివారం మనుబోలు కోదండరామపురంలోని రేషన్ దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. దుకాణాల్లో సరుకుల నిల్వలకు సంబంధించిన వివరాలను నోటీసు బోర్డులో వుంచాలన్నారు.



రేషన్ దుకాణంలో డీటీ బషీర్